క్లుప్తంగా

20న నెల నెలా వెన్నెల

ఖమ్మంగాంధీచౌక్: నగరంలోని భక్త రామదాసు కళాక్షేత్రంలో ఈ నెల 20న సాయంత్రం 6 గంటలకు నెల నెలా వెన్నెల కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు మోటమర్రి జగన్మోహన్‌రావు, అన్నాబత్తుల సుబ్రమణ్యకుమార్, కె.దేవేంద్ర, నాగబత్తిని రవి, వేల్పుల విజేత, నామ లక్ష్మీనారాయణ, వేముల సదానందం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్‌కు చెందిన సిరిమువ్వ కల్చరల్స్ కళాబృందం 'హక్కు' నాటిక ప్రదర్శించనున్నట్లు తెలిపారు.

నల్లచట్టాలను ఉపసంహరించుకోవాలి

నేలకొండపల్లి: కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నల్ల చట్టాలను ఉపసంహరించుకోవాలని ముస్లిం మైనార్టీ సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. వక్ఫ్ బోర్డు సవరణను వ్యతిరేకిస్తూ గురువారం రాత్రి సంఘం ఆధ్వర్యాన నిరసనగా ర్యాలీ తీశారు. ఈ సందర్భంగా సంఘం ప్రతినిధి ఎండీ.వాజీద్ మాట్లాడుతూ.. వక్ఫ్ బోర్డు చట్టానికి వ్యతిరేకంగా క్షేత్రస్థాయిలో ఆందోళనలు నిర్వహిస్తామని హెచ్చరిస్తూ కేంద్రం తీరుపై మండిపడ్డారు. ఈ కార్యక్రమంలో షేక్ ఖాసింసాహెబ్, అబ్దుల్, ఖాసీం, హుస్సేన్, మదార్‌సాహెబ్ తదితరులు పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం

ఖమ్మం మామిళ్లగూడెం: ఖమ్మం కొత్త బస్టాండ్ ప్రాంగణంలో, 53వ డివిజన్ పరిధిలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ ఖమ్మం ఆధ్వర్యాన ఏర్పాటు చేసిన చలివేంద్రాన్ని గురువారం ఆ డివిజన్ కార్పొరేటర్ పగడాల శ్రీవిద్య ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆర్ట్ ఆఫ్ లివింగ్ టీచర్స్ కోఆర్డినేటర్ పి.వెంకట్, సీనియర్ టీచర్ శ్రీనివాస్‌రెడ్డి, రోటరీ క్లబ్ ఖమ్మం ప్రెసిడెంట్ రవీంద్రనాథ్, బి.నారాయణరావు, వెంకట్‌రెడ్డి, నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

సర్వజ్ఞ విద్యార్థినికి అవార్డు

ఖమ్మం సహకారనగర్: ఇటీవల అఖిల భారత స్థాయి నృత్య, సంగీత పోటీల్లో తమ విద్యార్థిని అదితి మాన్య బాలరామ అవార్డు సాధించినట్లు సర్వజ్ఞ పాఠశాల డైరెక్టర్లు ఆర్‌వీ నాగేంద్ర కుమార్, నీలిమలు తెలిపారు. గురువారం పాఠశాలలో విద్యార్థినిని అభినందించారు.



వేసవి గండం..!

పెద్దాస్పత్రిలో పొంచి ఉన్న నీటి కష్టాలు

- భూగర్భ జలాలు అడుగంటడంతో తగ్గిన ప్రవాహం
- ఆస్పత్రి బావి, బోర్లలోనూ ఇదే పరిస్థితి
- కేఎంసీ నుంచి రోజు విడిచి రోజు సరఫరా
- మున్ముందు మరిన్ని ఇబ్బందులు


ట్రామాకేర్ భవనం కోసం ఏర్పాటు చేసిన బోరు

ఖమ్మంవైద్యవిభాగం: ఖమ్మం ప్రభుత్వ జనరల్ ఆస్పత్రికి నీటి కష్టాలు పొంచి ఉన్నాయి. ఓ పక్క భూగర్భ జలాలు అడుగంటడం, మరో పక్క మున్సిపల్ కార్పొరేషన్ నుంచి రోజు విడిచి రోజు నీటి సరఫరాతో కష్టాలు తప్పేలా లేవు. అంతేకాక బోర్ల ద్వారా కూడా నీటి సరఫరా తగ్గిపోతుండటంతో ఇప్పుడిప్పుడే నీటి కష్టాలు ఎదురవుతున్నాయి. రానున్న రోజుల్లో నీటి కష్టాలు మరింత పెరిగే అవకాశం ఉండడంతో అధికారులు ఆందోళన చెందుతున్నారు.

నిత్యం కిటకిట..

ఏడాది పొడవునా రోగులతో ఆస్పత్రి రద్దీగా ఉంటుంది. ఇందులో 500లకుపైగా పడకలు ఉండగా..


పెద్దాస్పత్రిలోని బావి

జనరల్ ఆస్పత్రితో పాటు మాతా శిశు ఆరోగ్య కేంద్రంలో నిత్యం బెడ్లు నిండిపోయి ఉంటాయి. రోగులు, వారి సహాయకులతో రోజంతా కిటకిటలాడుతుంటుంది. దీంతో నిత్యం కాలకృత్యాలు, స్నానాలు, వాటర్ ప్లాంట్లకు భారీగానే అవసరం ఉంటుంది. అయితే ఈ వేసవిలో అవసరం మేరకు నీరు సరఫరా కాక రోగులు ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పుడే ఇలా ఉంటే మున్ముందు మరిన్ని ఇబ్బందులు ఎదురయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి.

భూగర్భ జలాలు అడుగంటడంతో..

నడి వేసవి కాలం రావడంతో జిల్లాలోని చాలా ప్రాంతాల్లో భూగర్భ జలాలు అడుగంటాయి. అదే పరిస్థితి పెద్దాస్పత్రి పరిసరాల్లోనూ వచ్చింది. ఆస్పత్రిలో ఉండే బావి అడుగంటగా.. బోర్ల నుంచి సరపడా నీరు రావట్లేదు. మోటార్ వేసినప్పుడు అరగంట రావడం, ఆ తర్వాత ఆగిపోతున్నాయి. ఆస్పత్రిలో రూ. 21 కోట్ల వ్యయంతో ఎమర్జెన్సీ క్రిటికల్ కేర్ భవనం నిర్మిస్తున్నారు. దాని కోసం వేసిన బోర్ నీటితో భవన నిర్మాణ అవసరాలకు వినియోగిస్తున్నారు. దాని ప్రభావం ఆస్పత్రికి నీరు సరఫరా చేసే బోర్లపై పడుతుందని ఆస్పత్రి సిబ్బంది చెబుతున్నారు. పలుమార్లు నల్లాల నుంచి నీళ్లు రావడం ఆగిపోతుండటంతో రోగులు ఆస్పత్రి అధికారులకు ఫిర్యాదులు చేస్తుండగా.. బోర్లు, బావి నుంచి తాత్కాలికంగా సరఫరా చేస్తున్నారు.

కేఎంసీ నుంచి రోజు విడిచి రోజు..


మున్సిపాలిటీ నీటిని నిల్వ చేసే సంప్

పెద్దాస్పత్రిలోని జనరల్ ఆస్పత్రి, మాతా శిశు ఆరోగ్య కేంద్రాలకు నిత్యం 2.20లక్షల లీటర్లు నీరు అవసరం ఉంటుంది. ఇందులో జనరల్ ఆస్పత్రికి 1.20లక్షలు, ఎంసీహెచ్‌కు లక్ష లీటర్లు అవసరం అవుతుంది. అయితే ఎంసీహెచ్‌కు మిషన్ భగీరథ నీరు నిత్యం సరఫరా అవుతుండడంతో ప్రస్తుతానికి ఇబ్బందులు ఎదురు కావట్లేదు. ఒకవేళ ఇబ్బందులు వస్తే ట్యాంకర్ల ద్వారా సంప్‌లో నింపి సరఫరా చేస్తారు. కానీ జనరల్ ఆస్పత్రిలోని ట్రామాకేర్ భవనం, మినరల్ వాటర్ ప్లాంట్లు, ఆపరేషన్ థియేటర్, క్యాథ్‌ల్యాబ్, క్యాజువాలిటీ, డయోగ్నస్టిక్ హబ్, ఆర్థోపెడిక్, సర్జికల్ వార్డులు, మేల్, ఫిమేల్ వార్డులు, ఐసీయూ, కంటి, మినిస్టీరియల్ తదితర విభాగాలకు నిత్యం రెండు బోర్లు, బావి ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఒక పక్క బోర్లు, బావి ద్వారా వచ్చే నీరు తగ్గిపోవడం, రోజు విడిచి రోజు నీటి సరఫరాతో సమస్య వచ్చిపడింది. ఖమ్మం మున్సిపల్ కార్పొరేషన్ నుంచి గతంలో నిత్యం నీటి సరఫరా ఉండేది. వేసవి దృష్ట్యా రోజు విడిచి రోజు సరఫరా చేస్తుండడంతో సమస్య వచ్చిపడింది.

ప్రస్తుతానికి పర్వాలేదు..



ఆస్పత్రికి నీటి సరఫరాలో ప్రస్తుతానికి ఎలాంటి ఇబ్బంది లేదు. భూగర్భ జలాలు అడుగంటడంతో బోర్ల నుంచి నీటి సరఫరా తగ్గింది. మరో రెండు బోర్లు వేస్తే ఇబ్బందులు తొలగుతాయి. కేఎంసీ నుంచి రోజు విడిచి రోజు కాకుండా రోజూ నీరు సరఫరా చేయాలని కోరాం. స్టోరేజీ ట్యాంకుల సామర్థ్యాన్ని పెంచితే శాశ్వత పరిష్కారం లభిస్తుంది. ఈ విషయాలను ఉన్నతాధికారులకు నివేదించాం.

– డాక్టర్ బి.రాంబాబు, ఆర్ఎంఓ

కానీ రాబోయే కాలంలో నీరు ఎలా సరఫరా చేస్తారో అర్థం కాని పరిస్థితులు నెలకొన్నాయి.

కేఎంసీలో ఎలాంటి ఎంపికలు చేపట్టొద్దు


సమావేశంలో మాట్లాడుతున్న నవీన్‌బాబు

ఖమ్మంమయూరిసెంటర్: రాజీవ్ యువ వికాసం పథకం కోసం వచ్చిన దరఖాస్తులను కులాలు, కార్పొరేషన్ల వారీగా విభజించి ఆయా శాఖల జిల్లా కార్యాలయాల్లో అందజేయాలని ఎస్సీ కార్పొరేషన్ అధికారి నవీన్‌బాబు, బీసీ కార్పొరేషన్ ఉద్యోగిని నీలిమ మెప్మా సిబ్బందికి సూచించారు. గురువారం కేఎంసీలో అధికారులు, మెప్మా సిబ్బందితో దరఖాస్తుల పరిశీలనపై నిర్వహించిన సమావేశంలో వారు మాట్లాడారు. అర్హుల ఎంపిక జిల్లా కార్యాలయాల్లో జరుగుతాయని, కేఎంసీలో ఎలాంటి ఎంపికలు చేపట్టొద్దని సూచించారు. అంతక ముందు కలెక్టరేట్‌లోని ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో ఎస్సీ సంక్షేమ వసతిగృహాల సంక్షేమ అధికారులతో ఆయన సమావేశం నిర్వహించి అధికారులకు విధులు కేటాయించారు. కుటుంబానికి ఒక్క దరఖాస్తు మాత్రమే ఉండేలా చూడాలని, వారి కుల, ఆధాయ వివరాలను పక్కాగా పరిశీలన చేయాలని, మార్గదర్శకాలను పాటిస్తూ అర్హులను గుర్తించాలని సూచించారు.

పోస్టర్లు ఆవిష్కరణ..

● 25 నుంచి వీరన్నస్వామి జాతర..


జాతర పోస్టర్లు ఆవిష్కరిస్తున్న కమిటీ ప్రతినిధులు

నేలకొండపల్లి: మండలంలోని మోటాపురంలో ఈనెల 25 నుంచి 27వ తేదీ వరకు శ్రీ వీరన్నస్వామి జాతర నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ చావా కోటయ్య తెలిపారు. ఆలయం వద్ద గురువారం ఆయన పోస్టర్లను విడుదల చేసి మాట్లాడారు. ఎంతో చరిత్ర కలిగిన వీరన్న స్వామి జాతర విజయవంతానికి విస్తృత ప్రచారం చేస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏలూరి శ్రీనివాసరావు, రావెళ్ల కృష్ణారావు, పుల్లయ్య, కృష్ణమూర్తి, చావా కిరణ్‌కుమార్, బాగం మురళి, బెల్లం వాసు, రామారావు, మందుల లక్ష్మయ్య, చావా కృష్ణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

● మానసిక పునరావాస కేంద్రం పోస్టర్లు..

ఖమ్మం మామిళ్లగూడెం: మానసికంగా, అనారోగ్యంతో ఆపదలో ఉన్న వారికి సహకారంగా ఏర్పడిన గాయత్రి మానసిక పునరావాస కేంద్రం వాల్ పోస్టర్లను గురువారం ఖమ్మం మంచికంటి ఫంక్షన్ హాల్‌లో సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్ ఆవిష్కరించారు. ప్రభుత్వాలు పునరావాస కేంద్రానికి ఆర్థికంగా సాయం చేయడంతో పాటు అవసరమైన వైద్య సేవలూ ఉచితంగా అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు బొంతు రాంబాబు, మాజీ కౌన్సిలర్, నాయకులు నర్రా రమేష్, ఎస్పీఆర్‌డీ ఖమ్మం జిల్లా అధ్యక్షులు ధోనవన్ నాగరాజు, లక్ష్మీనారాయణ, వెంకటేష్, కోడిరెక్క శ్రీనివాసరావు, ధోనవన్ లక్ష్మీదేవి, యాకోబు, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

● టెక్నికల్ ఫెస్ట్ పోస్టర్లు..

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ఎస్‌బీఐటీ కళాశాలలో ఈ నెల 25న నిర్వహించనున్న టెక్నికల్ ఫెస్ట్ ఆరోహన్–2025కు సంబంధించిన పోస్టర్లు, థీమ్ సాంగ్‌ను గురువారం కళాశాల చైర్మన్ గుండాల కృష్ణ, సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ జి.ధాత్రిలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా బెలూన్లు ఎగురవేసి మాట్లాడుతూ.. విద్యార్థులకు టెక్నికల్ ఈవెంట్లు, డ్యాన్స్, సాంగ్స్, స్కిట్స్, ఫ్లాష్ మాబ్లతో పాటు ట్రెజర్ హంట్, పోస్టర్ ప్రజెంటేషన్, టెక్నికల్ క్విజ్ తదితర పోటీలు నిర్వహిస్తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల అకడమిక్ డైరెక్టర్లు గుండాల ప్రవీణ్‌కుమార్, గంధం శ్రీనివాసరావు, ఏవీవీ శివప్రసాద్, జె.రవీంద్రబాబు, ఎన్.శ్రీనివాసరావు, ప్రిన్సిపాల్ రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

● ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభల పోస్టర్లు..

ఖమ్మంమయూరిసెంటర్: ఈ నెల 25, 26, 27 తేదీల్లో ఖమ్మంలో నిర్వహించే ఎస్ఎఫ్ఐ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని సంఘ జిల్లా కమిటీ సభ్యులు వెంకటలక్ష్మి, రాగిణిలు పిలుపునిచ్చారు. గురువారం నగరంలోని ప్రభుత్వ మహిళ డిగ్రీ కళాశాలలో సంఘ రాష్ట్ర మహాసభల పోస్టర్లు ఆవిష్కరించిన సందర్భంగా వారు మాట్లాడారు. మహాసభల్లో విద్యారంగ సమస్యలు, విద్యార్థినుల సమస్యలపై చర్చించబడుతుందని, ప్రభుత్వ విధానాలపై భవిష్యత్‌లో చేపట్టబోయే ఉద్యమాల కార్యాచరణ జరుగుతుందన్నారు. విద్యార్థులు, విద్యావేత్తలు, మేధావులు ఈ సభలను జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంఘ కళాశాల కార్యదర్శి శరణ్య, నాయకులు పూజిత, శైలజ, నవ్య, మానస, సానియా, సంజన, ప్రవళిక తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్తంగా..

● విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి


మాట్లాడుతున్న ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి


ఖమ్మంవ్యవసాయం: హెచ్‌టీ విద్యుత్ సమస్యల పరిష్కారానికి కృషి చేస్తామని ఎస్ఈ ఇనుగుర్తి శ్రీనివాసాచారి అన్నారు. ఖమ్మంలో గురువారం నిర్వహించిన హెచ్‌టీ విద్యుత్ వినియోగదారుల సమావేశంలో ఆయన మాట్లాడారు. సిక్ ఇండస్ట్రీస్ రివైవల్(పునర్జీవం) కోసం ప్రభుత్వం ఒక పథకాన్ని అమలుచేస్తుందని, హెచ్‌టీ విద్యుత్ సమస్యలను తెలియజేస్తే పరిష్కరిస్తామన్నారు. ఈ సమావేశంలో గ్రానైట్ ఫ్యాక్టరీస్ అసోసియేషన్ అధ్యక్షులు యుగంధర్, కార్యదర్శి గోపాల్‌రావు, కోశాధికారి పరమేశ్వర్‌రెడ్డి, సీనియర్ అకౌంట్స్ అధికారి శ్రీధర్, డీఈలు నాగేశ్వరరావు, రామారావు, ఏడీఈలు పాల్గొన్నారు.

● జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలి


ప్లేట్లు అందుకున్న విద్యార్థులతో ఏఎంఓ రవికుమార్

కామేపల్లి: విద్యార్థులు పాఠశాలకు క్రమం తప్పకుండా హాజరై ఉపాధ్యాయులు చెప్పే పాఠాలను శ్రద్ధగా విని చదివితే జీవితంలో ఉన్నతస్థాయికి ఎదుగుతారని జిల్లా అకడమిక్ మోనిటరింగ్ అధికారి కేశవపట్నం రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని ముచ్చర్ల–జాస్తిపల్లి, కొత్త లింగాల, పొన్నేకల్ ప్రభుత్వ పాఠశాలల్లో రికార్డులను గురువారం ఆయన పరిశీలించారు. వచ్చే విద్యా సంవత్సరానికి పంపిణీ చేయనున్న ఏకరూప దుస్తుల కుట్టు పాయింట్‌ను పరిశీలించి గడువులోగా సిద్ధం చేయాలన్నారు. అనంతరం పొన్నేకల్‌లో 5వ తరగతి విద్యార్థులకు నిర్వహించిన వీడ్కోలు సమావేశంలో పాల్గొనగా.. ఉపాధ్యాయుడు బి.సీతారాం విద్యార్థులకు మధ్యాహ్న భోజన ప్లేట్లు, బాక్సులను వితరణగా అందించారు. ఎంఈఓ వెంకట్, హెచ్ఎం లీలావినోద, ఉపాధ్యాయులు నాగన్న, వీరన్న, నాగేశ్వరరావు, అంగన్‌వాడీ టీచర్లు జ్యోతి, ఝాన్సీ పాల్గొన్నారు.

● కొత్తగూడెం పాఠశాలలో గ్రాడ్యుయేషన్ డే


సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో విద్యాధికారి

ఖమ్మంఅర్బన్: నగరంలోని 14వ డివిజన్ కొత్తగూడెం ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో గురువారం గ్రాడ్యుయేషన్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐదవ తరగతి పూర్తి చేసిన 20 మంది విద్యార్థులను మండల విద్యాధికారి లక్ష్మీశైలజ సన్మానించారు. అనంతరం మాట్లాడుతూ.. విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత చదువులు పూర్తి చేసి మంచి స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

● పీజీ విద్యార్థులకు వీడ్కోలు

ఖమ్మం సహకారనగర్: నగరంలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో గురువారం పీజీ విద్యార్థులకు ఘనంగా వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ జి.పద్మావతి మాట్లాడుతూ.. విద్యార్థులందరూ కష్టపడి ఉన్నత శిఖరాలకు ఎదగాలని ఆకాంక్షించారు. అనంతరం విద్యార్థులు ప్రిన్సిపాల్‌ను సన్మానించారు. ఈ కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపాల్ రామారావు, అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

● ప్రజా సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు

కామేపల్లి: ప్రజా సమస్యలను పరిష్కరించడకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పూర్తిగా విస్మరించాయని సీపీఎం వైరా డివిజన్ కార్యదర్శి భూక్యా వీరభద్రం అన్నారు. సీపీఎం మండల విస్తృత స్థాయి సమావేశం గురువారం కామేపల్లిలో ఇంజం నాగభూషణం అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రభుత్వాలు ఎన్నికల్లో ప్రజలకు ఇచ్చిన హామీలను తక్షణమే నెరవేర్చాలని, ప్రజా సమస్యల పరిష్కారానికి పార్టీ ఆధ్వర్యాన మండలంలో సమగ్ర సర్వేలు చేసి ఉద్యమాలకు సిద్ధం కానున్నట్లు తెలిపారు. కొంత మంది రైతులకు మాత్రమే ప్రభుత్వ పథకాలు అందించి రాష్ట్ర ప్రభుత్వం చేతులు దులుపుకోవాలని చూస్తే రైతు ఆగ్రహానికి గురికాకతప్పదన్నారు. సీతారామ ప్రాజెక్టు ద్వారా కామేపల్లి, కారేపల్లి, ఏన్కూర్ మండలాలకు సాగునీరు అందించాలని, కాలువ భూనిర్వాసితులకు నష్టపరిహారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో మండల కార్యదర్శి అంబటి శ్రీనివాసరెడ్డి, బాదావత్ శ్రీను, కిన్నెర రామచంద్రయ్య, సకినాల శ్రీనివాసరావు, దేగల రాంబాబు, వీరస్వామి, బాష్‌సింగ్ పాల్గొన్నారు.

● దివ్యాంగుల కోర్ కమిటీ సమావేశం


రామకృష్ణాచారిని సన్మానిస్తున్న ఎంపీడీఓ

రఘునాథపాలెం: రఘునాథపాలెంలోని రైతు వేదికలో గురువారం టీడీజేఏసీ తెలంగాణ దివ్యాంగుల జాయింట్ యాక్షన్ కమిటీ కోర్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఎస్ఆర్‌డీఎస్ ఫౌండర్ గద్దం రాంబాబు, టీడీజేఏసీ స్టేట్ చైర్మన్ పీ.వీ.చలమయ్య హాజరై కమిటీ నియమ నిబంధనలు, దివ్యాంగుల హక్కులు, సేవా కార్యక్రమాలపై వివరించారు. అనంతరం రఘునాథపాలెం సీఐ ఉస్మాన్ షరీఫ్, ఎస్సై నరేష్‌లకు కమిటీని పరిచయం చేస్తూ దివ్యాంగుల సమస్యలపై సహకరించాలని కోరారు. అనంతరం ఎంపీడీఓ అశోక్‌కుమార్ నూతన అధ్యక్షుడు తూముల రామకృష్ణాచారిని సత్కరించి అండగా ఉంటామన్నారు. మండల ముఖ్య సలహాదారుడు ఎస్‌కె.యాకూబ్‌మియా, ఉపాధ్యక్షుడు ఏ.శివలాల్, ప్రధాన కార్యదర్శి భిక్ష, కార్యదర్శి మంగయ్య, కోశాధికారి ఉపేంద్రయ్య, ప్రచార కార్యదర్శి సాయికుమార్, డైరెక్టర్ పవన్, జి. వీరన్న, ఎస్‌కె.నాజియ పాల్గొన్నారు.

● 'వనజీవి' కుటుంబానికి పరామర్శ


పరామర్శిస్తున్న ఎమ్మెల్సీ మధు, సండ్ర తదితరులు

ఖమ్మంరూరల్: పద్మశ్రీ వనజీవి రామయ్య కుటుంబసభ్యులను గురువారం బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య పరామర్శించారు. రామయ్య స్ఫూర్తితో ప్రతి ఒక్కరూ పర్యావరణాన్ని కాపాడేందుకు పాటుపడాలని, అప్పుడే ఆయనకు మనమిచ్చే ఘనమైన నివాళి అన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు బెల్లం వేణుగోపాల్, మాజీ జెడ్పీటీసీ వరప్రసాద్, నాయకుడు విజయ్ తదితరులు పాల్గొన్నారు.

● వనజీవి ఆశయాలు కొనసాగిస్తాం..

ఖమ్మం సహకారనగర్: వనజీవి రామయ్య ఆశయాలను కొనసాగిస్తామని న్యూవిజన్ పాఠశాల అకాడమిక్ డైరెక్టర్లు సీహెచ్.కార్తీక్, పి.స్ఫూర్తి పేర్కొన్నారు. గురువారం పాఠశాలలో రామయ్య చిత్రపటానికి నివాళులర్పించాక మాట్లాడారు. ప్రిన్సిపాల్ అబాద్ అలీ పాల్గొన్నారు.

● భాస్కర్ ఆశయాలు సాధించాలి..

ఖమ్మంరూరల్: సీపీఐ నేత, సీనియర్ జర్నలిస్ట్, అమరజీవి దండి భాస్కర్ ఆశయ సాధనకు పునరంకితమవుదామని సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ మొహమ్మద్ మౌలానా అన్నారు. గురువారం ఏదులాపురంలోని ఆయన స్మారక స్తూపం వద్ద 9వ వర్ధంతి వేడుకలు నిర్వహించిన సందర్భంగా మాట్లాడారు. ప్రజా సమస్యలపై అధికారులను కదిలించి పేదలకు అండగా నిలిచారన్నారు.చెరుకుపల్లి భాస్కర్ ,పార్టీ జిల్లా నాయకులు జితేందర్ రెడ్డి, షేక్ జానీమియా, ఎర్ర బాబు, సిద్దినేని కర్ణకుమార్, అజ్మీరా రామ్మూర్తి, పుచ్చకాయల కమలాకర్, ఉన్నం రంగారావులతో పాటు ఓరుగంటి శేషగిరి, వెంకటేశ్వరరావు, పాల్గొన్నారు.

● నివాళి..

ఖమ్మం మామిళ్లగూడెం: దానవాయిగూడెం మున్నేరు చెక్‌డ్యాం వద్ద ప్రమాదవశాత్తు జారిపడి మృతిచెందిన త్రీటౌన్ ప్రాంతానికి చెందిన కూచిపూడి బెన్నీ పార్థివదేహానికి బీఆర్ఎస్ ఖమ్మం నగర అధ్యక్షుడు పగడాల నాగరాజు, కార్పొరేటర్ దోన్‌వాన్ సరస్వతి, రవి, నన్నే, తదితరులు శుక్రవారం నివాళులర్పించారు.

● 'బార్' కార్యవర్గ ప్రమాణ స్వీకారం


ప్రమాణ స్వీకారం చేస్తున్న బార్ అధ్యక్షుడు వెంకటేశ్వరరావు

ఖమ్మం లీగల్: బార్ అసోసియేషన్ నూతన కార్యవర్గం గురువారం బార్ అసోసియేషన్ హాల్‌లో ఎన్నికల అధికారి ఆధ్వర్యాన ప్రమాణ స్వీకారం చేశారు. బార్ అధ్యక్షుడు తొండపు వెంకటేశ్వరరావు, ఉపాధ్యక్షురాలు మోత్కూరి విజయశాంత, కార్యదర్శిగా గద్దల దిలీప్‌కుమార్, జాయింట్ సెక్రెటరీ ఎం.నవీన్‌కుమార్, గ్రంథాలయ కార్యదర్శి ఎస్.రాంబాబు, క్రీడల కార్యదర్శి కేవీవీ లక్ష్మి, కోశాధికారి పి.నరసింహారావు, మహిళా ప్రతినిధి పి.ఇందిర ప్రమాణ స్వీకారం చేశారు. సీనియర్, జూనియర్ న్యాయవాదులు, వివిధ న్యాయవాద సంఘాలు ఐలు, ఐఏఎల్, టీడీపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ లీగల్ సెల్ న్యాయవాదులు పాల్గొన్నారు.

● డ్రోన్ వినియోగంపై వర్క్‌షాప్..

ఖమ్మం సహకారనగర్: మారుతున్న సాంకేతికతలో భాగంగా డ్రోన్ వినియోగం అన్ని రంగాల్లో విస్తరిస్తున్న నేపథ్యాన ఉపాధి అవకాశాలపై అవగాహన కలిగి ఉండాలని ఎస్ఆర్‌బీజీఎన్ఆర్ కళాశాల వైస్ ప్రిన్సిపాల్ ఏ.ఎల్.ఎన్ శాస్త్రి అన్నారు. ఐక్యూఏసీ విభాగం ఆధ్వర్యాన 'డ్రోన్స్ పైలటింగ్ రంగం–ఉపాధి అవకాశాలు' అనే అంశంపై వర్క్‌షాప్ నిర్వహించి రిమోట్ పైలట్, ఐవాఆగ్రో ఇన్నోవేటివ్స్ డైరెక్టర్ ఎం.సాయికిరణ్ డ్రోన్ల వినియోగంపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

● మిస్ వరల్డ్ పోటీలపై నిరసన

ఖమ్మంమయూరిసెంటర్: హైదరాబాద్ వేదికగా వచ్చే నెలలో నిర్వహించనున్న మిస్ వరల్డ్ పోటీలను రద్దు చేయాలని పీఓడబ్ల్యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సీహెచ్.శిరోమణి, ఐద్వా రాష్ట్ర నేత బుగ్గవీటి సరళ, ఎస్ఎఫ్ఐడబ్ల్యూ జిల్లా అధ్యక్షురాలు పోటు కళావతి, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి పి.జానకి డిమాండ్ చేశారు. ఈమేరకు మహిళ, యువజ, విద్యార్థి సంఘాల ఆధ్వర్యాన గురువారం ఖమ్మంలో నిరసనలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. వ్యాపార మార్కెటింగ్ కోసం అందాల పోటీలను తెలంగాణలో నిర్వహించడం రాష్ట్ర ఆత్మగౌరవాన్ని దెబ్బతీయడమే అన్నారు. తక్షణమే ప్రభుత్వం ఈ ఆలోచన మానుకోవాలని హితవుపలికారు. ఈ పోటీలకు తెలంగాణ ప్రభుత్వం రూ.250 కోట్లు ఖర్చుచేయడం అర్థరహితమన్నారు. ఆయా సంఘాల నేతలు షేక్ బషీరుద్దీన్, టి.ప్రవీణ్, వెంకటేష్, రవీందర్, శ్రవణ్, చింతల రమేష్, జి.లలిత, ఆవుల మంగతాయి, ప్రతాపనేని శోభ, తాటి నిర్మల పాల్గొన్నారు.

● అధ్యాపకుల నిరసనకు విద్యార్థుల మద్దతు



ధర్నా చేస్తున్న విద్యార్థులు

ఖమ్మం సహకారనగర్: రాష్ట్రంలోని యూనివర్సిటీలో ఏళ్ల తరబడి పనిచేస్తున్న కాంట్రాక్ట్ అధ్యాపకులను పర్మినెంట్ చేయాలని అధ్యాపకులు తలపెట్టిన ఆందోళనకు గురువారం విద్యార్థులు మద్దతుగా నిలిచారు. స్థానిక యూనివర్సిటీ పీజీ కళాశాల ఎదుట పీజీ, వ్యాయామ కళాశాల విద్యార్థులు గురువారం ధర్నా చేశారు. ఈ సందర్భంగా పలువురు విద్యార్థులు మాట్లాడుతూ కేయూలో 30 ఏళ్లుగా పనిచేస్తున్న కాంట్రాక్టు అధ్యాపకులకు ఉద్యోగ భద్రత కల్పించకుండా ప్రభుత్వం తెచ్చిన జీఓ 21ని వ్యతిరేకిస్తున్నామన్నారు. కార్యక్రమంలో సమైఖ్య, వెంకటేష్, సురేష్ ఠాగూర్, అధ్యాపకులు డాక్టర్ రవి కుమార్, శ్యాంబాబు, కోటి, మధు, రాజీవ్‌రాజ్, లక్ష్మి, హరిత, రమ పాల్గొన్నారు.

కేఎంసీ సమాచారం

● వ్యాపారులకు జరిమానా

ఖమ్మంమయూరిసెంటర్: నగరంలోని రోడ్ల వెంట పండ్లను విక్రయిస్తున్న వీధి వ్యాపారులకు కేఎంసీ అధికారులు జరిమానా విధించారు. జూబ్లీ క్లబ్ వద్ద ఓ వ్యాపారికి రూ.1,000, ఓ ప్రైవేట్ పాఠశాల ఎదుట రోడ్డుపై చెత్త పడవేయడంతో పాఠశాల యాజమాన్యానికి రూ.3 వేల జరిమానా విధించారు.

● ట్రేడ్ లైసెన్సులు జారీ..


ట్రేడ్ లైసెన్సు అందిస్తున్న కేఎంసీ అధికారులు

నగరంలో ట్రేడ్ లైసెన్సుల జారీ ప్రక్రియను వేగవంతం చేశారు. శానిటేషన్ అధికారులు దుకాణాలను సందర్శించి లైసెన్సులు లేకుండా వ్యాపారాలు చేస్తున్న వారికి లైసెన్సులు జారీ చేస్తున్నారు. నగరంలోని ఓ బంగారు నగల దుకాణానికి లైసెన్సు జారీ చేసి రూ.26,450 ఫీజు వసూలు చేశారు.

● కేఎంసీ మేనేజర్‌గా బుచ్చిబాబు..

ఖమ్మం నగర పాలకసంస్థ కార్యాలయ మేనేజర్‌గా బుచ్చిబాబు నియమితులయ్యారు. తిరుమలగిరి మున్సిపల్ మేనేజర్‌గా పని చేస్తున్న ఆయనను సీడీఎంఏ అధికారులు కేఎంసీ మేనేజర్‌గా డిప్యూటేషన్‌పై బదిలీ చేశారు. ఆయన గురువారం కేఎంసీ కార్యాలయంలో విధుల్లో చేరారు.

● నాలాల ఆక్రమణలపై సమీక్ష..

నగరంలో నాలాల ఆక్రమణలపై కేఎంసీ కమిషనర్ అభిషేక్ అగస్త్య టౌన్‌ప్లానింగ్, ఇరిగేషన్, ఇంజినీరింగ్ అధికారులతో సమావేశం నిర్వహించారు. ప్రస్తుతం నగరంలోని నాలాల పరిస్థితులను గూగుల్ మ్యాప్ ద్వారా పరిశీలించారు. నాలాల ఆక్రమణలను తొలగించేందుకు చేపట్టాల్సిన చర్యలపై అధికారులతో చర్చించారు. నాలాలపై నిర్మాణాలపై నివేదికలు ఇవ్వాలని ఇరిగేషన్ అధికారులకు సూచించి వచ్చే వర్షాకాలం కల్లా వాటిని తొలగించడంతో పాటు కాలువల్లో ఉన్న వ్యర్థాలు, మొక్కలను తొలగించాలని ఆదేశించారు.

పోషణ పక్షోత్సవాలు

● కూసుమంచి: పోషకాహారంతోనే ఆరోగ్యం కలుగుతుందని ఐసీడీఎస్ నాయకన్‌గూడెం సెక్టార్ సూపర్‌వైజర్ ఉమ అన్నారు. సెక్టార్ పరిధిలోని గోరీలపాడుతండా అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం నిర్వహించిన పోషణ పక్షోత్సవ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. గర్భిణులు, బాలింతలు, చిన్న పిల్లలకు తప్పని సరిగా పోషకాహారం అందించాలన్నారు. ఈ సందర్భంగా పోషకాహారం స్టాళ్లను ప్రదర్శించగా గర్భిణులకు సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

● ఖమ్మంవన్‌టౌన్: పోషణ పక్షోత్సవాల్లో భాగంగా ఖమ్మం అర్బన్ ప్రాజెక్ట్ బుర్హాన్‌పురం సెక్టార్ పరిధిలో గురువారం సామూహిక సీమంతాలు, అన్నప్రాసన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులు తీసుకోవాల్సిన ఆహార నియమాలు, బిడ్డ పుట్టాక తీసుకోవాల్సిన జాగ్రత్తలు, మహిళా హక్కులు తదితర వాటి గురించి అర్బన్ ప్రాజెక్టు సీడీపీఓ వీరభద్రమ్మ వివరించారు. ఈ కార్యక్రమంలో పీఆర్‌టీయూ ప్రధాన కార్యదర్శి వై.వెంకటేశ్వర్లు, సూపర్‌వైజర్ సుధా భవాని, జిల్లా పోషణ అభియాన్ కోఆర్డినేటర్ బాబు, సతీష్, మహిళా సాధికారిక కోఆర్డినేటర్ సమరీన్, హెల్త్ సీఈఓ సంధ్యారాణి, ఏఎన్ఎం భవాని, రాజేశ్వరి, అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.


ఖమ్మంవన్‌టౌన్: చిన్నారులకు అన్నప్రాసన చేయిస్తున్న అధికారులు

వినతులు..

● తహసీల్దార్‌కు..


తహసీల్దార్‌కు వినతిపత్రం ఇస్తున్న నాయకులు

కూసుమంచి: అకాల వర్షాలకు తడిసిన వరి, మిర్చి, మొక్కజొన్న పంటలను మద్దతు ధరతో ప్రభుత్వం కొనాలని ఏఐకేఎంఎస్ నాయకులు గురువారం తహసీల్దార్ కరుణశ్రీకి వినతిపత్రం అందజేశారు. అనంతరం ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించారు. ఈ సందర్భంగా రాష్ట్ర సహాయ కార్యదర్శి బజ్జూరి వెంకట్రామిరెడ్డి మాట్లాడుతూ.. అసలే అష్టకష్టాల మీద రైతులు పంటలను పండిస్తుంటే అకాల వర్షాలు నిండా ముంచుతున్నాయని, ఈ సమయాన ప్రభుత్వం తడిసిన పంటలను కొని ఆదుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు సురేష్, వెంకన్న, రామస్వామి, వీరయ్య, రామయ్య, ఉప్పయ్య, వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

● డీఈఓ కార్యాలయంలో..

ఖమ్మం సహకారనగర్: ఈ నెల 5న బాబు జగ్జీవన్ రామ్ జయంతి రోజున నగరంలో కొన్ని పాఠశాలలు నిర్వహించారని, వాటిపై చర్యలు తీసుకోవాలని తెలంగాణ ప్రైవేటు టీచర్స్ ఫోరం(టీపీటీఎఫ్) జిల్లా అధ్యక్షుడు కొరకొప్పు రామారావు డిమాండ్ చేశారు. ఈ మేరకు డీఈఓ కార్యాలయ సూపరింటెండెంట్‌కు వినతిపత్రం సమర్పించారు. కార్యక్రమంలో గురుమూర్తి, శ్రీనివాసరావు, డేవిడ్, విజయ్, రాంబాబు పాల్గొన్నారు.